కాంగ్రెస్ విధానాలే పార్టీకి శ్రీరామరక్ష

● కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్

బంజారాహిల్స్, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ విధానాలే పార్టీకి శ్రీరామరక్ష అని సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ టీపీ ముషీరాబాద్ ఇన్‌చార్జి ప్రవీణ్, బీఎస్పీ నుంచి పుట్టల శైలజ, నరేందర్ తదితరులు గురువారం దానం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ.. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వచ్చి కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. పార్టీ కోసం పనిచేసే వారికి తగిన ప్రాధాన్యం ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.


దానం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న పలు పార్టీల నాయకులు


జవహర్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ నాయకులు

దానంను గెలిపించి అభివృద్ధికి సహకరించాలి

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు సహకరించాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు కెన్నడీ రాజు అన్నారు. దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరుతూ గురువారం గాంధీనగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి ప్రచారం చేశారు.

కార్మికుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): కార్మికుల శ్రేయస్సు కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి అన్నారు. గురువారం దానం నాగేందర్‌కు మద్దతుగా ముషీరాబాద్ డివిజన్‌లోని దాయార మార్కెట్, లేబర్ అడ్డా, పటాన్‌బస్తీలో కరపత్రాలు పంచుతూ దానం నాగేందర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ.... బీజేపీ, కార్మికుల హక్కులను, చట్టాలను కాలరాస్తూ కార్మికులకు అన్యాయం చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామానందరెడ్డి, రాజు, సురేందర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


దాయార మార్కెట్ లేబర్ అడ్డా వద్ద ప్రచారం చేస్తున్న ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంజిరెడ్డి,తదితరులు

దళితులందరూ దానంకు మద్దతివ్వాలి

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చే ప్రమాదం ఉందని, దళితులందరూ దానం నాగేందర్‌కు ఓటు వేసి గెలిపించాలని టీపీసీసీ ఎస్సీ సెల్ నేతలు జీ.ఎన్. కేశవ్, గజ్జెల సూర్యనారాయణ, గడ్డం రాజేష్, జగన్‌లు సూచించారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్ కట్టంబావి బస్తీలో డాక్టర్. బీ.ఆర్. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఇండియా కూటమికి మద్దతుగా దళితుల ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ ఎన్నికల్లో చేస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వ్యతిరేక చర్యలపై నేతలు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

రాంనగర్‌లో మాజీ కార్పొరేటర్ ప్రచారం

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా రాంనగర్ డివిజన్ ఆ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ జుహేర్ హుస్సేన్ ఆధ్వర్యంలో డివిజన్‌లో గురువారం రిసాలగడ్డ, హరినగర్, బాకారం తదితర ప్రాంతాలలో ఇంటింటి ప్రచారం జరిగింది. కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ ఆర్. కల్పనాయాదవ్ హాజరై కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి దానం నాగేందర్‌న గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో నాయకులు వేణుగౌడ్, కిరణ్, మురళీమోజేస్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో...

అంబర్‌పేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి మంచి స్పందన ఉందని, దానం నాగేందర్ 2 లక్షల ఓట్లతో విజయం సాధిస్తారని అంబర్‌పేట ఎన్నికల ఇన్‌చార్జి నాగభూషణం అన్నారు. అంబర్‌పేటలో కాంగ్రెస్ పార్టీకి మెజారిటీ ఓట్లు వస్తాయన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన టీపీసీసీ ఎస్సీ సెల్ నేతలు కేశవ్, సూర్యనారాయణ, రాజేష్

భారీ మెజార్టీతో గెలిపించండి అభివృద్ధి చేస్తా

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావు గౌడ్

తార్నాక, మే 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్ఎస్ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం తార్నాక డివిజన్ మాణికేశ్వర్‌నగర్‌లో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలతో కలిసి విస్తృతంగా పర్యటించి ఓటర్లను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సికింద్రాబాద్ ఎంపీగా తనను భారీ మెజార్టీతో గెలిపించినట్లయితే గత పది సంవత్సరాలుగా సికింద్రాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినట్లే, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మాణికేశ్వర్‌నగర్‌లో పర్యటిస్తున్న సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు, తదితరులు

పద్మారావుగౌడ్‌ను గెలిపించాలి: ఎమ్మెల్యే

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల హక్కులు రక్షించబడాలంటే ప్రజలందరూ సికింద్రాబాద్ సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి టి. పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఆర్‌టీ కాలనీ, కూరగాయల మార్కెట్, పార్సిగుట్ట రోడ్డు, సౌమ్య ఆస్పత్రి వీధి, రామాలయం వెనుక వీధి తదితర ప్రాంతాలలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


ఎన్నికల ప్రచారంలో డప్పు కొట్టి ఓట్లు అడుగుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

గోల్నాక, మే 9 (ఆంధ్రజ్యోతి): పద్మారావుగౌడ్ విజయాన్ని కాంక్షిస్తూ గురువారం గోల్నాక డివిజన్ లోని గోల్నాక, శాంతినగర్ తోట్ల బస్తీ, పలు బస్తీలలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మాజీ కార్పొరేటర్ కాలేరు పద్మావెంకటేష్, పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

పద్మారావును గెలిపించాలి: ముఠా జైసింహ

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పని చేసే పద్మారావును గెలిపించాలని బీఆర్ఎస్ యువ నేత ముఠా జైసింహ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. గురువారం గాంధీనగర్ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

బంగారం, వజ్రాలు, వెండి నగల స్వాధీనం

చాదర్‌ఘాట్, మే 9(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తూ కారులో తరలిస్తున్న బంగారం, వజ్రాలు, వెండి నగలను మలక్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మలక్‌పేట పోలీసులు గురువారం రాత్రి ఆస్మాన్‌ఘడ్‌లో వాహనాలను తనిఖీ చేస్తుండగా మలబార్ గోల్డ్‌కు చెందిన మారుతి ఓమిని కారులో బంగారం వజ్రాలు, వెండి నగలను తరలిస్తున్నట్లుగా గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.1.08 కోట్ల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్కిల్-16 డీఎంసీ మారుతి సుధాకర్

ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలి

● జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతి సుధాకర్

నల్లకుంట, మే 9 (ఆంధ్రజ్యోతి): ఓటు వజ్రాయుధం వంటిదని ఓటర్లందరూ తప్పనిసరి ఈ నెల 13న ఓటింగ్‌లో పాల్గొనాలని జీహెచ్ఎంసీ సర్కిల్-16 డీఎంసీ మారుతి సుధాకర్ కోరారు. గురువారం నల్లకుంట డివిజన్‌లోని గోల్నాకలో డీఎన్ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కుపై ప్రజలందరూ స్వచ్ఛందంగా ఓటింగ్ రోజున పాల్గొనాలని ఆయన సూచించారు. వేసవిలో ప్రజలకు ఉపశమనం కోసం అంబలి పంపిణీ చేశారు.

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. రాజ్ నారాయణ్ ముదిరాజ్ సూచించారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటింగ్ శాతం పెరగడానికి తమవంతు కృషి చేస్తున్నామని, ముఖ్యంగా విద్యావంతులు, మేధావులు, యువతీ, యువకులు ఓటు వేయడానికి ముందుకు రావాలని కోరారు.


అంజన్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బాబురావు

కాంగ్రెస్‌తోనే రాష్ట్రాభివృద్ధి: అంజన్ కుమార్

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని టీపీసీసీ వర్కింగ్ అధ్యక్షుడు ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ అన్నారు. గాంధీనగర్ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత ఎస్.బాబురావు గురువారం అంజన్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. బాబురావుకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలలో అయిదు గ్యారంటీలను ఇప్పటికే అమలు చేసిందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ, నగర ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్, ప్రధానకార్యదర్శి గుండు జగదీశ్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా మురళీమోజెస్

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మురళీమోజెస్ కాంగ్రెస్ సికింద్రాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఆయనకు టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్ గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మురళీమోజెస్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎం అనిల్ కుమార్ యాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్‌కుమార్ యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ గెలుపునకు తన వంతు కృషి చేస్తానని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కనకం కొమురెల్లి, తూము అశోక్‌రెడ్డి

పెన్షనర్లకు కేటాయించిన భూమిని సొసైటీకి అప్పగించాలి

● తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ ప్రభుత్వం గోపన్నపల్లిలోని భాగ్యనగర్ టీఎన్జీవోఎస్ గచ్చిబౌలి మ్యాక్ హౌసింగ్ సొసైటీకి కేటాయించిన 189. 11 ఎకరాల భూమిని ప్రభుత్వ స్వాధీనం చేసుకుందని, తిరిగి ఆ భూమిని కేటాయించాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కనకం కొమురెల్లి, తూము అశోక్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చిన నాడే సొసైటీకి కేటాయించిన భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తేనే తమ ప్లాట్లు వస్తాయని నమ్మకంతో ఉన్నామన్నారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం కోసం సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామన్నారు. సమావేశంలో నాయకులు సూర్యకళ, వేణుగోపాలస్వామి, రామనాథంరెడ్డి, కె. ఝాన్సీరాణి, లక్ష్మణరావు, జి. శ్రీదేవి, వి.వి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అండతో మరోసారి విజయం సాధిస్తా

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి): ప్రజల అండతో మరోసారి ఎంపీగా భారీ మెజారిటీతో విజయం సాధించబోతున్నానని కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి కాచిగూడ లింగంపల్లి చౌరస్తా వద్ద నిర్వహించిన బైక్ ర్యాలీని కిషన్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. బైక్ ర్యాలీ బర్కత్‌పుర చౌరస్తా, రత్నానగర్, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తా, తిలక్‌నగర్, శివం రోడ్, రెడ్ బిల్డింగ్ చౌరస్తా, అంబర్‌పేట మెయిన్ రోడ్, బాపూనగర్, చెన్నారెడ్డినగర్, పటేల్‌నగర్ చౌరస్తా, సీపీఎల్ రోడ్, ఆలీకేఫ్ చౌరస్తా, గోల్నాక, కాచిగూడ, కృష్ణానగర్, నింబోలిఅడ్డ శ్రీమహంకాళి ఆలయం వరకు ఈ బైక్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో నియోజకవర్గం ప్రజలు భారీ మెజారిటీ అందించారని ఈ నెల 13న జరిగే ఎన్నికలలో కూడా నియోజకవర్గం ప్రజలు మరోకసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. ఎస్. గౌతమ్‌రావు, మాజీమంత్రి కృష్ణాయాదవ్, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, మాజీ కార్పొరేటర్ వనం రమేష్, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


లింగంపల్లి చౌరస్తాలో ప్రచారం చేస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

దేశ భవిష్యత్ కోసం బీజేపీని గెలిపించండి: లక్ష్మణ్

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): దేశ భవిష్యత్ కోసం, దేశ రక్షణ కోసం నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం మరోసారి రావాలని అందుకు బీజేపీని గెలిపించాలని ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ ఓటర్లను కోరారు. గురువారం బోలక్‌పూర్ డివిజన్‌లోని మహాత్మానగర్, ఇందిరానగర్, బ్యాంక్ ఆఫ్ బరోడా కాలనీ, సంజీవయ్యనగర్‌లో సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ కమలం గుర్తుకు ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.... కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఓట్ల కోసం రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను విస్మరించారని ఆరోపించారు.

కిషన్‌రెడ్డి విజయం ఖాయం

గోల్నాక, మే 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తిరిగి రెండోసారి అన్నివర్గాల ప్రజల అండదండలతో విజయం సాధించడం ఖాయమని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు అన్నారు. కిషన్‌రెడ్డి విజయాన్ని ఆకాంక్షిస్తూ పార్టీ గోల్నాక డివిజన్ అధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్‌లోని శాంతినగర్, తోట్ల బస్తీలలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో గౌతమ్‌రావు పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకుని బీజేపీకి ఓటు వేసి కిషన్‌రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు.

బీజేపీ కార్నర్ మీటింగ్‌కు మహిళల స్పందన

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ గాంధీనగర్ డివిజన్‌లోని గాంధీనగర్ వై జంక్షన్‌వద్ద బుధవారం రాత్రి నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు మహిళలనుంచి మంచి స్పందన లభించింది. ఈ సందర్భంగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షురాలు గీతామూర్తి మాట్లాడుతూ కార్నర్ మీటింగ్‌కు వందలసంఖ్యలో మహిళలు హాజరు కావడం విశేషమన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్


గోల్నాకలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఆపార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు


వీఎస్టీవద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వాహనాల తనిఖీలు

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ దృష్ట్యా చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ పర్యవేక్షణలో చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది గురువారం రాత్రి వీఎస్టీ, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య ఆధ్వర్యంలో వాహనాలు తనఖీ చేయడంతోపాటు వాహనదారులకు పలుసూచనలుచేశారు. లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా డబ్బులు, ఇతర ఉచితాలు సరఫరా జరగకుండా చూడాలని, సరైనపత్రాలు లేకుండా ఎవరైనా 50 వేల రూపాయలకు మించి తీసుకువెళ్తే అట్టినగదును సీజ్ చేస్తామని పోలీసులు వాహనదారులకు సూచించారు. ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలనిసూచించారు. ఎస్ఐలు కోటేశ్వరరావు, మౌనిక పాల్గొన్నారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

● 41 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

కవాడిగూడ, మే 9 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులను గురువారం దోమలగూడ పోలీసులు అరెస్టు చేశారు. దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... బండమైసమ్మనగర్‌లోని రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో స్టేషన్ ఎస్ఐ గిరి శ్రీకాంత్ తన బృందంతో తనిఖీలు నిర్వహించారు. నంబర్ ప్లేట్ లేని యాక్టీవా వాహనంపై అనుమానస్పదంగా ప్లాస్టిక్ బ్యాగులతో వెళుతున్న వాహనాన్ని ఆపి విచారించాగా అతను బ్యాగులలో తరిస్తున్న బియ్యం రేషన్ బియ్యంగా గుర్తించారు. అతని విచారించగా లబ్ధిదారుల నుంచి బియ్యం సేకరించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయిస్తున్నామని తెలిపినట్లు పోలీసులు తెలిపారు. బియ్యం అక్రమంగా తరలించే వ్యక్తి బోలక్‌పూర్‌కు చెందిన మహ్మద్ ఖలీద్ హుస్సేన్, ముషీరాబాద్‌కు చెందిన ఫయాజ్‌ఖాన్‌గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అతని వద్దనుంచి 105 ప్లాస్టిక్ బ్యాగుల్లో ఉన్న ఉన్న బియ్యం దాదాపు 41 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకొని పౌరసరఫరాల శాఖ అధికారులకు అందజేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న దివ్యాంగుల జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్ కామినేని వెంకటేష్

ఇండియా కూటమికి దివ్యాంగుల జాతీయ సంఘం మద్దతు

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఇండియా కూటమికి మద్దతు ఇస్తున్నట్లు డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ దివ్యాంగుల జాతీయ సంఘం కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, కో-కన్వీనర్ కామినేని వెంకటేష్‌లు ప్రకటించారు. గురువారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఇండియా కూటమికి తాము చేసిన విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకొని ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చిన ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీకి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 17 ఎంపీ స్థానాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసేందుకు దివ్యాంగులను కోరారు. దివ్యాంగులందరూ విధిగా 13వ తేదీన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో నాయకులు సత్యనారాయణ, ఇమ్రాన్, కిరణ్, ఉదీన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లి మందలించడంతో ఇంట్లో నుంచి వెళ్లిపోయిన కుమార్తె

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి): తల్లి మందలించడంతో ఓ వివాహితురాలు ఎవరికి చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం. నింబోలిఅడ్డలో నివాసం ఉంటున్న సరస్వతి బాయి కుమార్తె సంతోష్ బాయి(26) వివాహమైంది. భర్తకు దూరంగా తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది. బుధవారం సాయంత్రం తల్లి మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురైన సంతోష్‌బాయి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం రాత్రి తల్లి కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

ఓటమి భయంతోనే బీజేపీపై దుష్ప్రచారం

● మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి

బర్కత్‌పుర, మే 9 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, మాజీమంత్రి కృష్ణాయాదవ్‌లు ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చడం, రిజర్వేషన్లను రద్దు చేయడం ఎవరి తరం కాదని ప్రధాని మోదీ స్పష్టమైన ప్రకటన చేసినప్పటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ ఇతర ప్రతిపక్ష పార్టీలు లేనిపోని విమర్శలు చేస్తున్నారని, వాటిని ప్రజలే తిప్పి కొడతారని వారన్నారు. గురువారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని దీనిని ఎస్సీ, ఎస్టీ, బీసీలు గ్రహించి ప్రతిపక్ష పార్టీలకు సరైన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని, వాటిని మాత్రమే రద్దు చేస్తామని బీజేపీ అగ్రనాయకత్వం ప్రకటించిందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాల ఆరోపణలపై లీగల్ నోటీసులు జారీ చేశామని పరువు నష్టం దావా కూడా వేస్తామన్నారు. సమావేశంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్. ఎన్. గౌతమ్‌రావు, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్, బీజేపీ నేతలు వేముల అశోక్‌కుమార్, అమర్‌నాథ్, రచనారెడ్డి, ఎంవీ సుభాష్, రాజశేఖర్‌రెడ్డి, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు

చిక్కడపల్లి, మే 9 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లో ఈ నెల 13న పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ డీఈఈ సాయితరుణ్ తెలిపారు. చిక్కడపల్లిలోని సిటీసెంట్రల్ లైబ్రరీలో 10, 11, 12, 13 పోలింగ్ స్టేషన్‌లలో పోలింగ్ ఏర్పాట్లను గురువారం సాయితరుణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధికంగా 45 మంది అభ్యర్థులు సికింద్రాబాద్ నియోజకవర్గంలో పోటీలో ఉన్నారని వివరించారు. గాంధీనగర్ డివిజన్‌లోని తమ పరిధిలో సిటీసెంట్రల్ లైబ్రరీలో నాలుగు పోలింగ్ బూత్‌లు, పీఅండ్‌టీ కమ్యూనిటీ హాల్‌లో 2, జవహర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో 3, కవేలి గ్రౌండ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3 మొత్తం 12 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని వాటిలో పోలింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు వివరించారు. దివ్యాంగులకు, ట్రై సైకిళ్లు, వృద్ధులకు వెహికల్స్ ఏర్పాటు ఉందన్నారు. జీహెచ్ఎంసీ ప్రాపర్టీ టాక్స్‌అధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

శామ్ పిట్రోడా ప్రజలకు క్షమాపణ చెప్పాలి

● టీడీపీ సికింద్రాబాద్ అధ్యక్షుడు సాయిబాబా

రాంనగర్, మే 9 (ఆంధ్రజ్యోతి): దక్షిణ భారతదేశ ప్రజలు ఆఫ్రికన్లుగా ఉంటారని కాంగ్రెస్ నేత శామ్ పిట్రోడా వ్యాఖ్యలు చేయడం టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా ఖండించారు. ఈ వ్యాఖ్యలు ప్రజల మధ్య విద్వేషాలు, అసమానతలు, రెచ్చగొట్టేలా ఉన్నాయని అన్నారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. శామ్ పిట్రోడా వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయన్నారు. మనందరం భారతీయులమని స్వాతంత్ర్యం సాధించిన 75 ఏళ్లుగా ప్రజలంతా కలిసిమెలిసి జీవిస్తున్నారని, వారి మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల కాంగ్రెస్ పార్టీకే నష్టం వాటిల్లుతుందన్నారు. వెంటనే శామ్ పిట్రోడా ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెలట కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, నాయకులు ఎస్. ప్రకాష్, నర్సింగ్‌గౌడ్, భాను, కిరణ్, వెంకటేష్, యాదగిరి, మల్లికార్జున్, శక్తిప్రేమ్, సత్యనారాయణ, భిక్షపతిచారి పాల్గొన్నారు.

టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్‌గా శ్రీనివాస్ గుప్తా

ముషీరాబాద్, మే 9 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్‌గా ఉప్పల శ్రీనివాస్ గుప్తా నియమితులయ్యారు. ఆయనకు ప్రచార కమిటీ రాష్ట్ర కన్వీనర్ మధుయాష్కీ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముషీరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉప్పల శ్రీనివాస్‌గుప్తా మాట్లాడారు. తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన సీఎం రేవంత్‌రెడ్డి, మధుయాష్కీలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆర్యవైశ్యులు సంపూర్ణ మద్దతు ఇచ్చేలా తన వంతు కృషిచేస్తానన్నారు. పార్టీకోసం అంకిత భావం, క్రమశిక్షణతో పనిచేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజలకు దక్కేల కృషి చేస్తానన్నారు.


శ్రీనివాస్‌గుప్తా